# నా మదిలో నీ పదచ్ఛాయ

## కోడూరు శ్రీ వేంకటేశ్వరస్వామి

పద్మరాగ మణులు కుప్ప పోసినా అన్నట్లుగ తూర్పున భాను బింబం పైకెగసో్తంది. పక్షుల కిలకిలా రావములతో ప్రకృతి పులకిసూ్త, గరికలపై నిలచిన మంచు ముత్యాలతో ధరణిని అభిషిక్తం చేసి వీలసిల్లుతున్న ప్రకృతి పుష్య మాస అగమన్నాన్ని సూచిసో్తంది.

అప్పుడే కన్నులు పెడు్తన్న ముగ్గులు, బాలికలు అలంకరిసు్తన్న గొబ్బెమ్మలు ముంగిళ్ళ నలంకరిసూ్త, చూపరుల నలరిసు్తన్నాయి. ఆ ముగ్గుల్లో కలిసి చూపరుల నాకర్షిసు్తన్న ఒక మానిని మాలిని.

* * * * * *

మాలినీ!

ఇదే నీ పేరని మొన్నీ మధ్యే తెలిసింది. నా మదిలో పుష్యంలో మెదిలిన నీ తలపులు ప్రణయమై, నిర్ణయమైన ప్రేమ భావాల్ని నీతో చెప్పటానికి చైత్రం వరకూ పట్టింది. ఇంత కాలం నీ కదలిక నా మదిలో మెదిలి, వేణునాదమై, నాట్యకత్తె అభినయమై, పర్వతాగ్రాలకి రూపుదించిన శిల్ప కళామతి వేలార్చిన రసరమ్య శిల్పమై, గాయకుని అలాపనై, కవి మలిచిన కవితై, వీణా తంత్రుల శబ్దమై, నీళ్ళబ్బమై, విశ్వనాథుని కిన్నెరసాని మాదిరి, మరో మందాకిని లా కదలి వచ్చినా అంతరంగం మీద నుంచి నీ ముంగిట నర్తించింది. ఈ మధ్యలో నిన్నెన్నడైనా కలిసిందా?

ఇన్నాళ్ళ కాల గమనంలో నీ గురించి పూర్తిగ తెలుసుకున్నాను. నీ అలవాట్లు, తత్వం, వ్యక్తిత్వం అన్నీనాకు నచ్చాయి. అందుకే నేను నిన్ను ప్రేమిసు్తన్నాను. నీ ప్రతిస్పందనని ప్రత్యక్షం చేసే ప్రత్యుత్తరం కోసం సహస్ర నయన విలసితుడ నవుతూ,

నీ
భరద్వాజ

* * * * * *

భరద్వాజా!

పుష్యంలో నే చూసిన చూపు నీ చేత చైత్రంలో తెల్పదగిన సుమధుర భావనికి కారణమైనదంటే, నా చూపు నీలో కలగాల్సిన భావననే కల్గించింది. నా చూపుకుసార్థకత ఏర్పడిరది. పుష్యంలో కలిగిననా అనుభూతికి, చైత్రంలో తెలిపిన నీ భావనకి మధ్య మన మదిలో కదిలిన భావనా వీచికలే మన ప్రేమకి నిదర్శనం. ప్రేమంటే తెలియని మూర్ఖులకి మనప్రేమ గుణపాఠం కావాలి. అన్ని విషయాలు వివరంగా మాట్లాడు కుందాము. రేపు కలుసుకో. ప్రతిప్రేమ ఒక కలయిక కోసమే.

నీ
మాలిని.

* * * * * *

ప్రతి ప్రేమికులు తొలి పరిచయాన్ని గడిపిన విధానానికి భిన్నంగా గడిచింది. ఆనంద రసరాగ డోలికల్లో ఊయలూగడం మినహాయిస్తే, భూత, వర్తమానాల సంయమనంతో భవిష్యత్తుకి అవసరమైన ప్రణాళికలతో, పరస్పర ప్రేమానురాగాలు జీవితాంతం పంచుకునే ఆశతో,. ఆశయంతో, అవగాహనతో జీవిత భాగస్వాములు కావటానికి నిర్ణయించుకున్నారు.

ఆ క్షణం వారి ప్రేమ వారికి దేవదాసు పార్వతిల ప్రేమకన్న, లైలామజ్నుల ప్రేమ కన్న రమ్య రేవంతల ప్రేమకన్న, .... ఉన్నతంగ అనిపించింది. అలా అనిపించటం తప్పుకాదు. ప్రతి వారు తమదంత గొప్ప ప్రేమ మరొటి లేదని, తమంత గొప్పగా ప్రేమించేవారు లేరనే అహంభావంలో ఉంటారు. అసలు ప్రేమలో నే ఆ అహంభావం ఇమిడి ఉందేమో అన్పిసు్తంటుంది. అసలు నా ఉద్దేశ్యం ప్రతివాడు ప్రేమిసు్తన్నానన్న భావనని ముందు ప్రేమిసూ్త ప్రేమలోకి దిగుతాడని నా అనుమానం. ఆ విషయం తర్వాత గానీ తెలియదేమో. తెలిసినా దానికంత ప్రాధాన్యత ఉండదేమో. ఉన్నా చాలా తక్కువగా ఉంటుందేమో! ఏది ఏమైతేనేం, వారిరువురి ప్రేమ, వివాహానికి దారితీసింది.

* * * *

చాలా అన్యోన్యంగ కొంతకాలం సాగింది. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించుకోవటంలో ఒకరికొకరు తీసిపోలేదు. ఆమె మాటని అతడెన్నడూ కాదనలేదు. అతడి అభిప్రాయాన్ని ఆమె త్రోసిపుచ్చనూలేదు. ఆమె ఆశయం అతనికి ఆచరణయోగ్యమైంది. అతని అభిప్రాయం ఆమెకి ఆమోదయోగ్యమైంది. మొత్తం మీద అంతా సమతుల్యంగా గడిచింది.

* * * *

"నువు నమ్ము నమ్మకపో నే చెప్పేది వాస్తవం". అన్నాడు భాను.

"నీ మీద అపనమ్మకం కాదు కాని, ఎందుకో నమ్మబుద్ధి కావటంలేదు".

"నేను చెప్పింది నీ సంసారాన్ని పాడు చెయ్యటానికి కాదు. బాగు చేసుకుంటావనే ఆశతో .... ఎందుకంటే...."

"నాకు తెలుసు అది నా పరువుకి సంబంధించిన విషయం".

"పైగా.... పబ్లిక్‌గా...."

"అవును... ఆలోచించాల్సిన విషయమే. కానీ... నా మాలిని మధువు సేవిసు్తందంటే.... ఆ ఆలోచనే భయంకరంగా ఉంది"

"మాలిని, మందాకిని అనే పేరున్న వాళ్ళు అలా చేయకూడదని రూలేం లేదు కదా. నేను చెప్పేది అక్షరాల నిజం".

"సరే. చూస్తాను.... నీ సహాయానికి నా కృతజ్ఞతలు".

* * * *

"మాలినీ!!... నిజమేనా" ప్రేమపూరితంగా, అనునయంగా అడిగాడు భరద్వాజ.

"అవును.... ఈ విషయం మీకు చెబుదామనే అనుకున్నాను. మీరు.... కాదనరనే ఉద్దేశ్యంతో చెప్పలేదు."

"అసలిదెలా సంభవం. నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది".

"నా స్నేహితురాలు ఒకామె అమెరికాలో స్థిరపడింది. అక్కడి వాతావరణానికి ఆమెకి అలవాటైంది. అందువల్ల ఆమె ఇక్కడికి వచ్చినపుడు ఆమెతో పాటు కంపెనీ కోసం నేనూ తీసుకుంటాను. అందులో తప్పులేదని నా ఉద్దేశ్యం. మీరు కాదనరనే ధైర్యం".

"నీవు ఈ విధంగా ప్రవర్తించటం సమాజంలో నా గౌరవమర్యాదలకి భంగకరమే కాక, నా మనసుకి వ్యతిరేకమైంది కూడ. నీవు ఇది మానుకోవటం మంచిది".

"బహుశ అది కుదరదేమో. నా మనసుకు అతి దగ్గరగ వచ్చిన స్నేహితురాలు ఆమె ఒక్కతే. ఆమె తృప్తి కోసం నేనా పని చెయ్యక తప్పదు. మిమ్మల్ని, మీ మాటని కాదనాలని కాదు. ఈ ఒక్క విషయంలో ...."

"మాలినీ! ఎంత గాఢంగా ప్రేమించుకున్న వ్యక్తులకైనా ఒకరొకరు పూర్తిగా అర్థం చేసికొన్న వారి మధ్యనైనా ఈ అనవగాహన ఎక్కడో అక్కడ తప్పదేమో. మనిషి అభిప్రాయాన్ని కూర్చుకోగలడు గాని సిద్ధాంతాల్ని కూర్చుకోలేడని నా అభిప్రాయం. స్నేహితురాలితో నీ స్నేహం సిద్ధాంతపరమైంది. నా సిద్ధాంతం నా కెంత గొప్పో, నీ సిద్ధాంతం నీకూ అంత గొప్పే. ఇంత సున్నితమైన విషయంలో విభేదించిన మనం కలిసి బతకటం... బహుశ కష్టం కావచ్చు."

ప్రేమ ఎంత గాఢమైనదైనా ఎన్నో కొన్ని విషయాలలోనైనా విభేదం లేకుండా ఉండదు. అలాటి సంఘటనలలో ఎవరో ఒకరు రాజీకి రాకపోతే అది తప్పక విభేదానికి దారి తీస్తుంది. మొదట్లో అభిప్రాయభేదాలని ప్రేమ కవర్ చేస్తుంది.రాజీ పడటం అనేది లేకపోతే ఎంత అన్యోన్యమైన ప్రేమైనా బ్రేక్ అవక తప్పదు. ప్రతి కలయికా విడిపోవడానికి నాంది అన్నాడో రచయిత.

"ఈ విషయంలో ఇద్దరి అభిప్రాయాలు ఒకటే నండి. నాదారి నేను చూసుకొంటాను.... క్షమించండి."

"ఇందులో క్షమించే ప్రసక్తి లేదు. ఒక సిద్ధాంతపరమైన విభేదంతో మనం విడిపోతున్నాము... గుడ్‌బై... మళ్ళీ మరో జన్మలో వీలుంటే కలుద్దాం..."

ఆమె అతడిమది గడప దాటింది.

* * * * * * *

కళ్ళు తెరవగానే తన కిష్టమైన భంగిమలో కనబడిన మాలినిని చూశాక తెలిసింది తను కలగన్నానని. ఆ రోజంతా అతడు ఆలోచిస్తూనే గడిపాడు. అతనికేమాత్రం అర్థం కావటంలేదు తనకా విధమైన కల ఎల్లా వచ్చిందో తన కలలో మాదిరిగా పూర్తిగా అవగాహనకి వచ్చిన ప్రేమికులు ఒక సిద్ధాంతం కోసం విడిపోవటం ఎంతవరకు సాధ్యం? అంతా అయోమయంగా తోచింది.

తన కలని రచయిత, మిత్రుడు అయిన శంభుని అడిగాడు. అతడు శరత్‌ని పూర్తిగ చదివాడు. అందుచేత అతడు ఎక్కువ . మనస్తత్వాలని పసిగట్టగలడు. అతడు చెప్పటం పెద్ద కష్టం కాకపోవచ్చని అతడ్ని అడిగాడు.

అతడు అంతా విని,

"నీ ఈ కలకి నేను వివరణ ఇవ్వలేను" అన్నాడు సాలోచనగా.

"ఏం? ఎందుకని... ఇది నిజ జీవితంలో పూర్తిగా అవాస్తవమే కావచ్చు. అయినా నీకు తోచింది వివరించు" అని అడిగాడు.

"ఎందుకంటే... నీ ఈ మాలిని కలే... నా మందాకిని కథ... నాకు తెలిసిన మరో మాలిని వాస్తవం".

"అంటే"

"ఇది వాస్తవానికి దూరమేమీ కాదు. ఒక వాస్తవాన్ని దృష్టిలో నుంచుకొని ఇదే ఇతివృత్తంతో నేను వ్రాసిన కథకి పాఠకులనుండి




మంచి రెస్పాన్స్ వచ్చింది. నిజ జీవితానికి ఏమాత్రం దర్పణం పట్టని కథని ఏ పాఠకుడూ గౌరవించడు. ప్రతి ప్రేమికుడూ ఇలాంటి కల కంటాడని నేను చెప్పలేను కానీ... ఇది మాత్రం నిశ్చయంగా నీ మదిలో ఆమె ఎద చప్పుడు.

"అంటే?"

"నీ ప్రేమ గూడు చెదురుతుందేమోనని నీలో అంతర్గతంగా ఉన్న భయం... అని నా అభిప్రాయం."

"ఖచ్చితంగా అంతే" అన్న మాలిని మాటలకి వెనుదిరిగి చూశాడు. ఆమె మొఖంలో చిరునవ్వు. తన సంభాషణలని పూర్తిగా విన్నట్టుంది.

●